క్లుప్తంగా

పోలింగ్ ఏజెంట్ ఇంటిపై దాడి



పోలీస్‌స్టేషన్ ఎదుట బీజేపీ కార్యకర్తలు

ఆదిలాబాద్‌టౌన్: పోలింగ్ ఏజెంట్ ఇంటిపై దాడి చేయడంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట బీజేపీ కార్యకర్తలు సోమవారం రాత్రి ఆందోళనకు దిగారు. ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి ఖిల్లా పోలింగ్ బూత్ స్టేషన్‌లో ఏజెంట్‌గా ఉన్న గొర్ల రాముపై ఓ వర్గానికి చెందిన 50 మంది వ్యక్తులు దాడి చేసినట్లు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో కొంత మంది ఇంటిపై రాళ్లు రువ్వడంతో పాటు తల్వార్లు, కత్తులతో దాడి చేశారు. గొర్ల రాము, గొర్ల రాకేశ్, గొర్ల కుసుమ, కిష్టన్నపై దాడి చేశారని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓ వర్గానికి చెందిన మహిళలను ముఖం చూపించాలని ఏజెంట్ పేర్కొనడంతో ఆ మహిళలు ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులకు తెలిపినట్లు సమాచారం. ఆగ్రహానికి గురైన వారు వారి ఇంటిపై దాడి చేసినట్లు తెలుస్తోంది. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట పెద్ద ఎత్తున బీజేపీ కార్యకర్తలతో పాటు పలువురు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది.

వృద్ధులు, దివ్యాంగులకు విద్యార్థుల సాయం

తాంసి: మండలంలోని కప్పర్ల పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధులకు, దివ్యాంగులకు పాఠశాలకు చెందిన విద్యార్థులు సాయం చేశారు. వలంటీర్లుగా పోలింగ్ కేంద్రంలో ఉన్న విద్యార్థులు వృద్ధులకు, దివ్యాంగులకు సాయం చేస్తూ.. పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లారు. ఈసందర్భంగా పలువురి విద్యార్థులను అభినందించారు.

అధికారులతో బీఆర్ఎస్ నాయకుల భోజనాలు



అధికారికి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

తలమడుగు: మండలంలోని కజ్జర్ల గ్రామంలో ఎన్నికల సిబ్బంది బీఆర్ఎస్ నాయకులతో భోజనాలు చేయడాన్ని నిరసిస్తూ.. ధర్మ సమాజ్ పార్టీ, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పోలింగ్‌బూత్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తూ కజ్జర్ల పంచాయతీ కార్యదర్శి బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి మొట్టే కిరణ్ కుమార్‌తో వంటలు చేయించి వడ్డించారు. పంచాయతీ కార్యదర్శి శోభారాణిపై, కారోబార్‌పై రమాకాంత్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎన్నికల సెక్టార్ అధికారి తిరుపతికి ఫొటోలు, వీడియోలు అందించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాంగ్రెస్ ఎంపీటీసీ గోదావరి కమలాకర్, నాయకులు గణేష్ మూడేళ్ల పోశెట్టి, సంతోష్, ఎనగంటి శ్రీనివాస్, స్వామి, తాండ్ర గణేష్, డీఎస్పీ నాయకులు అగ్గిమల్ల నవీన్, రామెల్లి సురేశ్, గొంటిముక్కుల మల్లయ్య పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- ఓటేసేందుకు ఉదయం నుంచే బారులు
- పలు కేంద్రాల్లో మొరాయించిన ఈవీఎంలు



నార్నూర్: ఓటు వేసిన జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



బేల: ఓటేసేందుకు పోటెత్తిన ఓటర్లు



ఉట్నూర్‌రూరల్: ఓటు వేసిన యువత



ఉట్నూర్‌రూరల్: చాందూరి గ్రామంలో..



బోథ్: ఓటు వేసిన నవ దంపతులు



సిరికొండ: బారులు తీరిన ఓటర్లు



సిరికొండ: మొదటిసారి ఓటు వేసిన యువకులు

జైనథ్‌లో 82.42 శాతం

జైనథ్: మండలంలోని 55 పోలింగ్ బూత్‌లలో 82.42 శాతం పోలింగ్ నమోదైంది. సోమవారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల్లో భారీగా ఓటర్లు పోటెత్తారు. తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు బారులు తీరారు. మండలంలో మొత్తం 39371 మంది ఓటర్లు ఉండగా.. 32452 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

గుడిహత్నూర్: మండలంలోని 36 పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు తాగునీరు, అత్యవసర వైద్యం, వికలాంగులు, వృద్ధుల కోసం వీల్ చైర్లు ఏర్పాటు చేశారు. జవహర్‌నగర్‌లోని పోలింగ్ కేంద్రాన్ని ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా పరిశీలించి ఏజెంట్లకు పలు సూచనలు చేశారు.

బజార్‌హత్నూర్: మండలంలో 30 గ్రామపంచాయతీల పరిధిలో 37 పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మారుమూల అటవీ ప్రాంతంలో గల మాన్కపూర్ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించే వరకు ఓట్లు వేసేది లేదని భీష్మించి కూర్చున్న గ్రామస్తులను తహసీల్దార్ శంకర్, ఎస్సై నరేశ్‌లు అక్కడికి చేరుకొని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తాకు ఫోన్‌లో మాట్లాడించి హామీ ఇవ్వడంతో ఓటు వేశారు. బజార్‌హత్నూర్ సాగునీటి ప్రాజెక్టులో ముంపు గ్రామం దేగామ నిర్వాసితులకు కొత్త ఇళ్లు మంజూరు చేస్తామని ఓటు వేస్తామని తెలపడంతో కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ గ్రామానికి చేరుకుని మంత్రి సీతక్కతో మాట్లాడించడంతో శాంతించిన గ్రామస్తులు ఓటింగ్‌లో పాల్గొన్నారు.

బోథ్: బోథ్ నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 74.80 శాతం పోలింగ్ నమోదైంది. బోథ్ మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం ఎక్కువ మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పరుపుల పల్లె గ్రామస్తులు పార్డి గ్రామంలో, జీడిపల్లె గ్రామస్తులు కరత్వాడ గ్రామంలో కాలినడన వెళ్లి ఓటుహక్కు వినియోగించుకున్నారు. కౌఠ(బి) గ్రామంలో 230వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించింది. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ, బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌లు పోలింగ్ సరళిని పరిశీలించారు.

ఓటు వేసిన ప్రముఖులు..

బోథ్ మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో ఎంపీ సోయం బాపురావ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. బోథ్‌లో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్, జెడ్పీటీసీ సంధ్యారాణి, సొనాలలో ఎంపీపీ తుల శ్రీనివాస్ ఓటు వేశారు.

ఉట్నూర్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల పర్వం సోమవారం ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలో మొత్తం 305 పోలింగ్ బూత్‌లలో ప్రజలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఖానాపూర్ నియోజకవర్గం వ్యాప్తంగా 72.13శాతం పోలింగ్ నమోదైంది. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ ఉట్నూర్, లక్కారం పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఉట్నూర్ డీఎస్పీ నగేందర్ ఆధ్వర్యంలో ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో 300 మంది పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సిరికొండ: మండలంలో సోమవారం జరిగిన సాధరణ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ సమయం ముగిసే వరకు 50 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.ఎండ తీవ్రత తక్కువ ఉండడంతో పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. నూతన ఓటర్లు ఉత్సాహంతో ఓటుహక్కు వినియోగించుకున్నారు.

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచే ఓటర్లు వరుస కట్టి ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండలంలో అంబుగాంలోని పోలింగ్ కేంద్రానికి వామన్‌నగర్ గ్రామస్తులు నడుచుకుంటూ వెళ్లి ఓటు వేశారు. భీంపూర్ మండలంలోని కరంజి(టి) పోలింగ్ కేంద్రానికి రాజుల్‌వాడీ గ్రామస్తులు నడుచుకుంటూ వెళ్లారు. తాంసి మండలంలోని 17 పోలింగ్ బూత్‌లలో 13621 మంది ఓటర్లు ఉండగా.. 11335 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. భీంపూర్ మండలంలో 36 బూత్‌లలో 19133 ఓటర్లకు 15163 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. తాంసి మండల కేంద్రంతో పాటు జామిడి పోలింగ్ కేంద్రాల్లో అరగంట పాటు సాంకేతిక లోపంతో ఈవీఎం మొరాయించింది.

జైనథ్: మాజీ మంత్రి జోగు రామన్న తన స్వగ్రామమైన మండలంలోని దీపాయిగూడలో ఓటుహక్కు వినియోగించుకున్నాడు. సోమవారం ఉదయం గ్రామానికి చేరుకున్న ఆయన కార్యకర్తలు, నాయకులతో కలిసి పోలింగ్ కేంద్రానికి వచ్చారు. ఓటువేసిన అనంతరం బయటకు వచ్చిన జోగు రామన్న వేలి సిరా చూపించారు. ఆనంద్‌పూర్‌లో జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి, కూర గ్రామంలో ఎంపీపీ మార్శెట్టి గోవర్దన్ తన సతీమణితో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మావల, ఆదిలాబాద్ రూరల్ మండలంలో పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిదర్, ఎస్సైలు ముజాహిద్, విష్ణు వర్ధన్‌ల పర్యవేక్షణలో బందోబస్తు కొనసాగింది. ఆదిలాబాద్ రూరల్ మండలంలో రెండు పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్ సమయంలో ఈవీఎంలు మొరాయించాయి. వాతావరణం చల్లగా ఉండడంతో ఉదయం నుంచే ఓటర్లు పోటెత్తారు. వాన్‌వాట్ గ్రామ పంచాయతీ పరిధిలోని మంగ్లీ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో నాలుగు కిలోమీటర్లు వాన్‌వాట్ పోలింగ్ కేంద్రానికి కాలినడకన వచ్చి ఓటు వేశారు.

నార్నూర్: గాదిగూడ, నార్నూర్ మండలంలోని పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటల నుంచి ఓటుహక్కును వినియోగించుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులను గ్రామపంచాయతీ సిబ్బంది, పోలీసులు వీల్ చైర్ సాయంతో ఓటుహక్కును వినియోగించుకునేలా సాయం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు పాటు 144 సెక్షన్ విధించారు. సీఐ రహీం పాషా, ఎస్సైలు రవికిరణ్, మహేశ్‌కుమార్ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మొత్తం 42 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. క్యూలైన్‌లో నిలబడి ఆదివాసీలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉట్నూర్ డీఎస్పీ నగేందర్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వృద్ధులు, దివ్యాంగులను వీల్‌చైర్‌ల ద్వారా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. మారుముల గ్రామాలైన గోపాల్‌పూర్, గోపాల్‌పూర్‌గూడ, మామిడిగూడ(ఏ) గ్రామస్తులు కాలినడకన పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు. ఇటీవల మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి జన్నావర్ కిశోర్ ఆస్ట్రేలియాలో అనారోగ్యంతో మృతి చెందగా.. కుటుంబసభ్యులు తీవ్ర దుఃఖంలో కూడా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారు.

నేరడిగొండ: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం ఓటర్లు ఓటు వేసేందుకు బారులు తీరారు. మండలంలో 23,550 ఓటర్లు ఉండగా, 36 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. చించోలి, సవర్గాం గ్రామాల్లో రెండు పోలింగ్ కేంద్రాలను నూతనంగా ఏర్పాటు చేశారు. కుమారి, తేజాపూర్ గ్రామాల్లో మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు ముందస్తుగా ప్రచారం చేపట్టారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తన స్వగ్రామమైన రాజుర గ్రామంలో ఆయన సతీమణి హరిప్రియతో కలిసి ఓటు వేశారు. కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ బొండిడి గ్రామంలో ఓటు వేశారు. మోడల్ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు సెల్ఫీలు దిగారు.

బేలలో 80.77శాతం



బేల: దివ్యాంగురాలిని తీసువస్తున్న అధికారి

బేల: మండలంలోని 41పోలింగ్ బూత్‌లలో మొత్తం 31,225 ఓటర్లలో 25,220 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. దీంతో మొత్తంగా పోలింగ్ 80.77శాతం నమోదైంది. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని మూడు పోలింగ్ బూత్‌లలో మొత్తం 3,706 ఓటర్లలో 2,728 మంది ఓటర్లు ఓటు వేయగా.. 73.61శాతం పోలింగ్ నమోదైంది. బేలలోని 71పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించింది.



తాంసి: నిపాని గ్రామంలో..



తాంసి: ఓటు వేసేందుకు వస్తున్న ఓటర్లు



ఇంద్రవెల్లి: క్యూలైన్‌లో ఓటర్లు



నేరడిగొండ: తేజాపూర్ బారులు తీరిన ఓటర్లు

తలమడుగు: మండలంలో 78శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల తీరును రాష్ట్ర ఎన్నికల పర్యవేక్షులు జాదవర్ వివేకానంద, తాహసీల్దార్, రాజమోహన్, ఎంపీడీవో శేఖర్ పర్యవేక్షించారు. దివ్యాంగులకు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గిరిజన గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఆదిలాబాద్‌రూరల్: కాలినడకన వస్తున్న ఓటర్లు



ఆదిలాబాద్‌రూరల్: తంతోలి గ్రామంలో..



బోథ్: ఓటు వేసిన యువకులు



నార్నూర్: వీల్ చైర్‌పై తీసుకెళ్తున్న సిబ్బంది



నేరడిగొండ: కుమారిలో..



మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



గండ్రత్ సుజాత దంపతులు..



డాక్టర్ ప్రవీణ్ అగర్వాల్ దంపతులు..

ఓటు వేసిన ప్రముఖులు



రిమ్స్ డైరెక్టర్ దంపతులు..



డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్..



సిరా గుర్తు చూపిస్తున్న కంది శ్రీనివాస రెడ్డి దంపతులు

ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో పలువురు ప్రముఖులు సోమవారం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాధారణ జనంతో వరుస క్రమంలో నిలబడి ఓటు వేశారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న జైనథ్ మండలంలోని దీపాయిగూడలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి జిల్లా కేంద్రంలోని కొలాం ఆశ్రమ పాఠశాలలో ఓటు వేశారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసిని కొలాం ఆశ్రమ పాఠశాలలో, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ఆదిలాబాద్ పట్టణంలోని పుత్లీబౌళిలో ఓటు వేశారు. టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత దంపతులు విద్యానగర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ నేరడిగొండ మండలంలోని బుగ్గారంలో ఓటు వేశారు. డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, ఆయన కుమారుడు యువరాజ్ రాథోడ్‌లు వారి స్వగ్రామం నార్నూర్ మండలంలోని భీంపూర్‌లో, సినీనటుడు, బీజేపీ నాయకులు అభినవ్ సర్దార్ ఆదిలాబాద్ పట్టణంలోని న్యూహౌజింగ్ బోర్డులోని ప్రాథమిక పాఠశాలలో ఓటు వేశారు.





ఓటుహక్కు వినియోగించుకున్న జోగు రామన్న, సిరా గుర్తును చూపిస్తున్న సినీ నటుడు అభినవ్ సర్దార్

జోరందుకున్న జొన్న కోతలు

- అకాల వర్షాలతో కొంత ఆలస్యం
- హార్వెస్టర్ యంత్రాలను ఆశ్రయిస్తున్న రైతులు

తాంసి: రైతులు సాగుచేసిన జొన్న పంట కోతలు ఊపందుకున్నాయి. ఈఏడాది కొంత ఆలస్యంగా ప్రారంభమైన కోతలు ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. జొన్న పంట అంతా ఒకేసారి కోతకు రావడంతో హార్వెస్టర్ యంత్రాలకు సైతం డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం మండల వ్యాప్తంగా ఏ పంట చేనులో చూసినా.. జొన్న పంట నూర్పిడి చేయిస్తూ రైతులు బిజీబిజీగా ఉన్నారు. పంట కోసేందుకు హార్వెస్టర్ యంత్రాలను ఆశ్రయిస్తున్నారు.

అకాల వర్షాలతో ఆందోళన..

ఇటీవల వరుసగా కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కోత దశకు వచ్చిన జొన్నపంట వర్షాలకు తడిస్తే పంటనాణ్యత దెబ్బతినడంతో పాటు దిగుబడిపై ప్రభావం చూపుతుందని హైరానా పడుతున్నారు. పంట తడిసిపోవడంతో రంగు మారడంతో పాటు దిగుబడిపై ప్రభావం ఉంటుందన్నారు. మరోపక్క ఆకాశం మేఘావృత్తమై ఉండడంతో రైతులు పంటను కోసేందుకు అవకాశం లేకుండా పోతుంది. గాలివానకు నేలకొరిగిన పంటను కూలీల ద్వారా పనులు చేయిద్దామంటే కూలీల కొరతతో పాటు అధికంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో రైతులు చేసేదీ లేక యంత్రాలపై ఆధారపడుతున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో పంట కోత చేపడుతున్నారు.

ఆరు వేల ఎకరాల్లో సాగు..

తాంసి, భీంపూర్ ఉమ్మడి మండలంలో మొత్తం ఆరు వేల ఎకరాలకుపైగా జొన్న సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. ప్రస్తుతం పంట కోతలు ఊపందుకున్నాయని ఇప్పటివరకు 40 శాతం నుంచి 50 శాతం వరకు కోతలు పూర్తయినట్లు అంచనా వేస్తున్నారు. కూలీల కొరత కారణంగా రైతులు యంత్రాలపై ఆధారపడుతున్నారు. ఒక ఎకరానికి పంట కోసేందుకు రూ.5వేల వరకు చెల్లిస్తున్నారు. హార్వెస్టర్ ద్వారా పంట కోతలు చేపట్టడం కొంత ఆర్థికంగా భారమైన తప్పనిసరి పరిస్థితుల్లో పనులు చేపడుతున్నారు. వేసవి ప్రారంభానికి ముందే భూగర్భజలాలు అడుగంటిపోవడంతో సరైన సమయంలో నీరందక కొంత దిగుబడి తగ్గింది.



జొన్న పంటను ఆరబెట్టిన రైతులు

తగ్గిన జొన్న దిగుబడి

పది ఎకరాల్లో జొన్న పంట సాగు చేశాను. సరిపడా నీరందక దిగుబడి తగ్గింది. ఎకరానికి 10 క్వింటాళ్ల లోపు దిగుబడి వచ్చింది. కూలీల కొరత కారణంగా పంట కోసేందుకు ఇబ్బంది అవుతోంది. పంట కోత ఆర్థికంగా భారమైనా.. హార్వెస్టర్ యంత్రాలను ఆశ్రయిస్తున్నాం.

– హరీశ్‌రెడ్డి, రైతు, జామిడి గ్రామం

'క్రీడాకారులకు అండగా ఉంటా'



నగదు అందజేస్తున్న మద్దెల ప్రసాద్

నేరడిగొండ: మండలంలో ఈనెల 18 నుంచి జరగనున్న నేరడిగొండ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొనే క్రీడాకారులకు అండగా ఉంటానని మద్దెల ప్రసాద్ అన్నారు. ఆయన సోదరుడు మద్దెల ప్రదీప్ జ్ఞాపకార్థం లీగ్‌లో పాల్గొనే హంగ్రీ హంటర్స్ జట్టు సభ్యులకు క్రీడా దుస్తుల కోసం సోమవారం రూ.10వేలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమంలో జట్టు కెప్టెన్ జాదవ్ పవన్ కుమార్, మద్దెల వినీల్, లీగ్ నిర్వాహకులు లఖన్, అనిల్, దినేష్, యోగి, గణేష్, సిద్ధూ, ఆదిత్య, సునీల్, రాజేశ్, మణిరాజ్ పాల్గొన్నారు.